ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం
27 మార్చి
2025







# అమెరికా విద్యా విధానంపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు

## భవిష్యత్ తరాలకు పెరగనున్న ప్రమాదం

**వాషింగ్టన్, రోమింగ్ న్యూస్:** అమెరికాలో ప్రాథమిక మరియు మాధ్యమిక విద్యా స్థాయిలో విద్యార్థుల చదవడం, గణిత నైపుణ్యాల అభివృద్ధి గణనీయంగా తగ్గిపోయిందని మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. “70% మంది విద్యార్థులు గణితంలోను, చదవడంలోను ప్రావీణ్యం పొందలేదు. నాలుగో తరగతి విద్యార్థుల్లో 40% మందికి ప్రాథమిక చదవడం కూడా రాదు. ఇప్పటివరకు విద్యాశాఖ చేపట్టిన విధానాల కంటే విద్యార్థుల ప్రగతి మరింత దిగజారింది” అని ఆయన పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఓ సమావేశంలో ట్రంప్ తన పరిపాలనా విధానాల్లో అమెరికా విద్యాశాఖను (Department of Education) పూర్తిగా మూసివేయాలని నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. “ఈ శాఖ విద్యార్థులకు ఏ ఉపయోగం చేయడం లేదు. అందుకే, మా ప్రభుత్వం అన్ని చట్టబద్ధ చర్యలు తీసుకుని వేగంగా వీలైతే అంత త్వరగా దీన్ని మూసివేయడానికి ప్రయత్నిస్తుంది” అని తెలిపారు. అమెరికా విద్యను రాష్ట్ర ప్రభుత్వాలకు తిరిగి అప్పగించాల్సిన అవసరం ఉందని ట్రంప్ స్పష్టం చేశారు. “విద్యను కేంద్ర ప్రభుత్వం కాకుండా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోకి తీసుకురావాలి. ప్రభుత్వాలు స్వతంత్రంగా తమ విద్యా విధానాలను రూపొందించుకుని, విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తును అందించగలవు” అని చెప్పారు. విద్యాశాఖ మంత్రి లిండా మెక్‌మహాన్ మాట్లాడుతూ, “మేము విద్యార్థుల హక్కులను రక్షించడానికి అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. విద్యా రంగంలో వివక్షను నిర్మూలించేందుకు కృషి చేస్తున్నాం” అని అన్నారు.

### విద్యలో క్షీణత - రాబోయే తరాలకు పెరుగుతున్న ప్రమాదం!

విద్యా నిపుణులు ఈ విషయాన్ని ఆందోళనగా పరిగణిస్తున్నారు. ప్రముఖ విద్యావేత్త డా. లయన్ కోమటి రెడ్డి గోపాల్ రెడ్డి, చైర్మన్, లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్స్, దిల్సుఖ్‌నగర్, హైదరాబాద్, TRSMA రాష్ట్ర సలహాదారు మరియు నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అలయెన్స్ (NISA) లైఫ్ మెంబర్, ఈ అంశంపై స్పందిస్తూ “విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకురాకుంటే రాబోయే తరాలకు ఇది చాలా ప్రమాదకరంగా మారుతుంది” అని హెచ్చరించారు.

“నేటి విద్యార్థులు పుస్తకాలపై కంటే మొబైల్ ఫోన్లపై ఎక్కువ సమయం గడుపుతున్నారు. వారి జీవనశైలి పూర్తిగా మారిపోయింది. Junk Food (జంక్ ఫుడ్) అలవాట్లు, శారీరక వ్యాయామం లేకపోవడం, తల్లిదండ్రుల నిర్లక్ష్యం కారణంగా పిల్లలు మానసిక మరియు శారీరకంగా బలహీనపడుతున్నారు. ఇది వారి భవిష్యత్తును తీవ్రంగా ప్రభావితం చేయగల అంశం” అని ఆయన అన్నారు.

### విద్యార్థుల భవిష్యత్ కోసం తగిన జాగ్రత్తలు అవసరం

డా. గోపాల్ రెడ్డి తన సూచనల్లో “పిల్లలకు పఠనపరమైన శ్రద్ధ పెంపొందించేందుకు తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలి. మొబైల్ వినియోగాన్ని పరిమితం చేయడంతో పాటు, పుస్తకాల పఠనాన్ని ప్రోత్సహించాలి. విద్యార్థులను సృజనాత్మకత, ప్రాక్టికల్ లెర్నింగ్, నైతిక విలువలు మరియు ఆరోగ్యపరమైన జీవనశైలికి ప్రేరేపించాలి” అని పేర్కొన్నారు. సమగ్ర విద్యా విధానాన్ని అభివృద్ధి చేసి, విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు కలిసికట్టుగా తీసుకోవాలి. లేకపోతే రాబోయే తరాలు చదవడంలోను, మానసిక ఆరోగ్య పరంగా కూడా వెనుకబడే ప్రమాదం ఉంది.

# గుట్టలో నేటి సాయంత్రం విద్యుత్ సరఫరా నిలిపివేత

**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో గురువారం సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఎంవీఎస్ నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ లో పవర్ ట్రాన్స్ఫార్మర్స్ ను ఏర్పాటు చేస్తున్నందున కొత్త గుండ్లపల్లి, పాతగుండ్లపల్లి, బీసీ కాలనీ, నల్ల పోచమ్మవాడకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఈనెల 29న నమాత్ పల్లి పూర్ణగిరి ఆలయంలో దుకాణం వేలం

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం నమత్ పల్లి గ్రామంలో గల పూర్ణగిరి శ్రీ సుదర్శన లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో తేదీ : 29-03-2025 శనివారం రోజున ఉదయం 10 గంటలకు పూజా సామాగ్రి దుకాణం వేలం పాట జరుపడును. ఆసక్తి కల్గిన భక్తులు పాల్గొనవచ్చు. వేలంపాటలో పాల్గొనేవారు పూచికత్తు రుసుము 50 వేల రూపాయలు చెల్లించగలరని మనవి. వేలం తీసుకున్న వారు తేదీ :10-04-2025 లోపు పూర్తి నగదును చెల్లించవలెను లేనిచో పూచికత్తు రుసుమును తిరిగి చెల్లించబడదు. పూజ సామాగ్రి దుకాణంలో భక్తులకు అవసరమ్యే అన్ని పూజ సామాగ్రి వస్తువులు మరియు ప్రసాదాలు అన్ని వేళలో అందుబాటులో ఉండేవిధంగా చూసుకోవాలి ఆలయ కమిటీ సభ్యుల మనవి చేశారు. దేవాదాయ ధర్మాదాయ ఇన్స్పెక్టర్ మరియు పూర్ణగిరి దేవాలయ కమిటీ 9989658874, 9948060875

# ‘గుట్ట’లో నగలతో పారియైన రాజస్థాన్ వ్యాపారులు అరెస్ట్

### నిందితుల నుండి 1.185 కేజీల బంగారం, 64.620 కిలోల వెండి స్వాధీనం

### చిట్యాలలో నిందితులు జితేందర్ సింగ్ రాథోర్, మధురాంను పట్టుకున్న పోలీసులు

### గుట్టలో కొన్నేండ్లుగా నిందితులు ‘జైభవాని జ్యూయల్లర్స్’ పేరుతో వ్యాపారం







**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** యాదగిరిగుట్టలో జ్యూయల్లరీ వ్యాపారం పేరుతో ప్రజలను మోసం చేసి కుదువపెట్టిన బంగారంతో ఉడాయించిన మార్వాడీ వ్యాపారులు జితేందర్ సింగ్ రాథోర్(జిత్తు), మధురాంను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. పక్కా సమాచారంతో నిఘా పెట్టిన పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి.. నిందితులు చిట్యాల నుండి కారులో వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నారు. యాదగిరిగుట్ట సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన జితేందర్ సింగ్ రాథోర్, సోదరుడు మధురాం గత కొన్నేండ్లుగా యాదగిరిగుట్టలో స్థిరనివాసం ఏర్పర్చుకుని ‘జైభవాని జ్యూయల్లర్స్’ పేరుతో బంగారం వ్యాపారం చేస్తున్నారు. కొత్త బంగారం అమ్ముతూనే పాత బంగారం కుదువపెట్టుకుని అవసరమైనవారికి అప్పులు కూడా ఇస్తుండేవారు. కొన్నేండ్లుగా నమ్మకంగా వ్యాపారం చేస్తుండడంతో.. ప్రజలకు కూడా వారిపై నమ్మకం పెంచుకుని పెద్ద మొత్తంలో పాత బంగారం కుదువపెట్టి అప్పులు తీసుకోగా.. కొందరు కొత్త బంగారు ఆభరణాల కోసం అడ్వాన్సులు కూడా ఇచ్చారు. ఇదే అదునుగా భావించిన నిందితులు జిత్తు, మధురాం.. ప్రజలు భారీ ఎత్తున కుదువపెట్టిన పాత బంగారంతో జనవరి 23న యాదగిరిగుట్ట నుండి పరార్ అయ్యారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుల స్వస్థలమైన రాజస్థాన్ కు వెళ్లి ముమ్మరంగా గాలించారు. ఈ క్రమంలో నిందితులు జితేందర్ సింగ్, మధురాంలు ఇద్దరూ కలిసి కారులో వెళ్తుండగా.. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి చిట్యాల శివారులో అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుండి 1.185 కిలోల బంగారం, 64.620 కిలోల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా మరో 1.946 కిలోల బంగారం సౌతిండియా బ్యాంకులో ఉన్నట్లు గుర్తించామని, అట్టి బంగారాన్ని వెంటనే సీజ్ చేయాలని సదరు బ్యాంక్ మేనేజర్ ను ఆదేశించామని యాదగిరిగుట్ట సీఐ రమేష్ తెలిపారు. నిందితుల నుండి స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి ఆభరణాలను సీజ్ చేశామని, నిందితుడు జిత్తు, మధురాంను కోర్టులో హాజరుపర్చి రిమాండ్ చేశామని పోలీసులు తెలిపారు.

# కేటీఆర్‌పై నమోదైన కేసు హేయమైన చర్య

## పార్టీ రాష్ట్ర నాయకుడు ప్రసన్న రాజ్



**నకిరేకల్ :** కేటీఆర్ పై కేసుల విషయంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నలగాటి ప్రసన్న రాజ్ నకిరేకల్ పట్టణం లో ప్రెస్ మీట్. నిర్వహించారు. ఆయన మాటల్లోనే..కేటీఆర్ పై నకిరేకల్ పోలీసులు ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయటం హాస్యాస్పదం ! కేటీఆర్ నకిరేకల్ పట్టణంలో 10 వ తరగతి పేపర్ లేకేజీ ఘటన విషయమై ట్విట్టర్ లో చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయాల్లో రాజకీయ నాయకులపై కేసులు కొత్తేమి కాదు కానీ. ..గుమ్మడికాయ దొంగేవర్రా అంటే భుజాలు తడుముకున్నట్లు మాపై అవాకులు చవాకులు పేలుతుంద్రు కేసులతో ఆరోపణలతో కేటీఆర్ గొంతు నొక్కటం ఎవరి తరం కాదు. పేపర్ లేకేజి చేసిన వారు నియోజకవర్గం ప్రజా ప్రతినిధి అనుచరులు కాదని చెప్పగలరా.స్థానిక ప్రజా ప్రతినిధి తమ అనుచరులు చేసిన తప్పును సమర్ధించుకొనే ప్రయత్నం లోనే బి ఆర్ఎస్ పై పై తప్పుడు ఆరోపణలు. పేపర్ లేకేజి తో నకిరేకల్ నియోజకవర్గం పరువు తీసింది కాక తగుదునమ్మా అంటూ మా పార్టీ నాయకులపై బురద జల్లే ప్రయత్నం కరెక్ట్ కాదు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమై ఈ డ్రామాలతో డైవర్షన్ పొలిటిక్స్ చేస్తుంది. ఈ దుండగులు చేసిన ఈ దుశ్చర్య వలనే బల్లెం ఝాన్సీ భవితవ్యం ఆగమ్య గోచరంగా మారింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు ఈ సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# చైత్ర ఫౌండేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

## సీఐ కొండల్ రెడ్డి



**శాలిగౌరారం మార్చి 26 :** పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి తో పాటు, మజ్జిగ ప్యాకెట్లను అందజేస్తున్న చైత్ర ఫౌండేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని శాలిగౌరారం సీఐ కొండల్ రెడ్డి అన్నారు. బుధవారం శాలిగౌరారం లోని జడ్పి స్కూల్, గీతాంజలి హైస్కూల్ పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు సీఐ కొండల్ రెడ్డి, శాలిగౌరారం ఎస్ ఐ సైదులు మజ్జిగ ప్యాకెట్లను పంపిణి చేశారు.ఫౌండేషన్ వారు ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు.ఈ సందర్భంగా వారు చైత్ర ఫౌండేషన్ ఛైర్మెన్ యంగలి రామకృష్ణ గౌడ్ ను అభినందించారు. ఈ కార్యక్రమం లో శాలిగౌరారం లయన్స్ క్లబ్ అధ్యక్షులు డెంకల సత్యనారాయణ, ప్రతినిధులు గుజలాల్ శేఖర్ బాబు,గుండ్ల రామ్మూర్తి, కర్నాటి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మొరాయించిన ప్లే స్టోర్, ఫోన్ పే, గూగుల్ పే

### యూపీఐ సర్వర్ డౌన్

### చేతిలో డబ్బులు లేక ప్రజల అవస్థలు





**జనగామ, మార్చి 26 (రోమింగ్ న్యూస్)** టీ తాగినా, కూరగాయలు కొన్నా, హెూటల్లో టిఫిన్ చేసిననా , సినిమాకి వెళ్లాలన్న ప్రతిదీ మొబైల్ ద్వారా అందులోని యాప్ లు ఫోన్ పే గూగుల్ పే పేటియం లనుండి చెల్లించడం ప్రజలకు అలవాటుగా మారడంతో బుధవారం ఈ ఫోను యాప్ లు పనిచేయకుండా మోరాయించడంతో అన్ని వర్గాల ప్రజలు అనేకమంది ఇబ్బందుల పాలయ్యారు. యూపీ సర్వర్లు పనిచేయకుండా పోవడంతో ఈ మొబైల్ యాప్ ల నుండి నగదు ట్రాన్స్ఫర్ కాకపోవడంతో లావాదేవీలు స్తంభించిపోయాయి. చేతిలో డబ్బులు లేకపోవడంతో ప్రజలు షాపింగ్ కి వెళ్ళాలి అన్న ఇతర అవసరాల కొరకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డిజిటల్ పేమెంట్స్ యాప్స్ అందుబాటులోకి వచ్చాక పేమెంట్స్ అన్నీ ఆన్ లైన్ లోనే చేస్తున్నారు. చేతిలో నగదు లేకున్నా చింతించాల్సిన అవసరం లేకుండాపోయింది.

అయితే కొన్నిసార్లు టెక్నికల్ ప్రాబ్లమ్స్ వల్ల యూపీఐ సేవలు నిలిచిపోతే యూజర్లు పడే పాట్లు అన్నీఇన్నీ కావు. తాజాగా ఇలాంటి పరిస్థితే తలెత్తింది. దేశవ్యాప్తంగా యూపీఐ సేవలు నిలిచిపోయాయి. యూపీఐ సర్వర్ డౌన్ అయ్యింది. యూపీఐ ట్రాన్సాక్షన్స్ కావడం లేదని.. బ్యాలెన్స్ చెక్ చేసుకొందామన్నా సాధ్యం కావడం లేదని సోషల్ మీడియాలో పలువురు పోస్టులు పెడుతున్నారు. అన్‌ఏబుల్ టు లోడ్ అకౌంట్ అనే మెసేజ్ వస్తోందంటూ ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం యూజర్లు వాపోతున్నారు. అంతేకాకుండా జనగామలో బుధవారం సాయంత్రం నాలుగు గంటల నుండి దాదాపు రాత్రి వరకు ఫోన్ పే గూగుల్ పే ఇలాంటివి రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల పనిచేయకపోవడంతో వీటికి అలవాటు పడ్డ ప్రజలు పలువురు అవస్థలు పడటం కనిపించింది. దీనికి సర్వర్లో తలెత్తిన సాంకేతిక కారణాలు అని కొంతమంది పేర్కొంటుండగా మరి కొంతమంది మార్చి నెల చివరలో బ్యాంకు సర్వర్లు బిజీగా ఉండడం వల్ల ఇలాగే జరుగుతుంది అని మరికొందరు తెలిపారు. అయితే ఈ సమస్యలు ఎక్కువగా ఆండ్రాయిడ్ పాత మోడల్, పాత సాఫ్ట్వేర్ వర్షన్ ఉన్న తక్కువ ధర ఫోన్ ల లో ఆగుపిస్తుందని ఎక్కువ ధర ఉన్న లేటెస్ట్ సాఫ్ట్వేర్ ఫోన్లలో ఈ సమస్య పెద్దగా ఉండదు అని పలువురు తెలిపారు.

అయితే ఎప్పటికప్పుడు ఈ యాప్ లను అప్డేట్ కూడా చేసుకుంటూ ఉండాలని అలాగే ఈ యాప్ లను ఉపయోగించినప్పుడు సర్వర్ డౌన్ అని వస్తుంటే మళ్ళీ మళ్ళీ ట్రై చేస్తే అవి పని చేసే అవకాశం ఉంటుందని కూడా ఇంకొందరు ద్వారా తెలిసింది. ఏది ఏమైనా ఈ ఆధునిక టెక్నాలజీ పై గుడ్డిగా ఆధారపడకుండా చేతిలో కొంత నగదు రూపంలో డబ్బు కూడా ఉంచుకోవడం అవసరం అంటూ పలువురు చర్చించుకోవడం కనిపించింది. ఎంతో టెక్నాలజీ పెరుగుతున్న ప్రస్తుత కాలంలో అందరూ టెక్నాలజీ పై ఆధారపడుతూ ఉండటం వల్ల ఒక్కసారిగా సమస్యలు తలెత్తితే మాత్రం పరిస్థితులు గందరగోళంగా మారుతాయి అని, ఎంతైనా అతి అంటానికి అంటూ పాత రోజులే మంచిది అంటూ యువకులు కూడా మాట్లాడుకోవడం కనిపించింది.

